# వరప్రసాది

సంతానము లేక హిదాయతుల్లా అల్లాకే కాదు, శివునకేకాదు, చెట్టులకును పుట్టలకును మొక్కుకొనెను. కాని ఫలము కనిపింపలేదు. వయసు ముదిరినను అతఁడపుడు హసీనాను పెండ్లాడెను. ఆనాఁడే అల్లా కలలోఁ గానబడి అతనికి కొడుకు కలుగునని వరమొసఁగెను. ఏఁడాది తిరగకముందే హసీనా కొడుకును గనెను. పుత్రోత్సాహము ఉల్లాకే కాదు; జనానాకే కాదు; పత్తనమునకు కాదు - ప్రజలందరికి గలిగినటు లుండెను.

హిదాయతుల్లా క్రొత్త శిస్తులతోపాటు పాత శిస్తుల నన్నిటిని తీసివేసెను. చెఱసాలలను ఖాళీచేయించెను. తనకుఁ గల ఖూనీ హక్కును విసర్జించెను.

మసీదు లన్నిట నవాఁజులు జరిగెను. ఆలయములలో అభిషేకము లాయెను పల్లియలలోఁ గూడ పంచదార బండ్లుతిరిగెను. ముసల్మానులకు ముసల్మాను రాజ్యము. హిందువులకు హిందూరాజ్యము దొరికెను.

తురకజోస్యులు హిందూజోస్యులును విడివిడిగా వ్రాసిన జాతకచక్రములన్నియు ఏకీభవించెను. ఆయువు నూఱేండ్లు రాజ్యలాభము రెట్టికి రెట్టి. విద్య నూటికి నూటొకటి కళత్రస్థాన మిఱుకు, ఇఱ్ఱుకు. పట్టినది బంగారము, మట్టినది మక్కా

కాజీ వచ్చెను; జిన్, మారీద్, జాన్, అఫ్రిద్ మొదలగు తురక దయ్యములకు దురాయి కట్టించెను. పురోహితుడు వచ్చి ఎన్నెమ్మలకు బ్రహ్మరాక్షసులకు షష్ఠీదేవికి భూతప్రేత పిశాచములకు రక్ష యిచ్చెను.

కాజీ పురోధల యనుమతితో హిదాయతుల్లా తన పసుఁబాపకు రహ్మత్ ఉల్లా అని నామకరణ మహోత్సవము నొనరించెను. రహ్మత్ అనఁగా దైవకృప.

హసీనా కళాశాస్త్రము కైకొనిరాఁగా ఉల్లా ఖురాను-ఏకరువులో నుండెడివాడు. పెద్దభార్య సాకినీ వచ్చి ఖురాను విని, హసీనాకు కళాశాస్త్రము చెప్పుచుండెడిది. ఇంతలో చిన్నఉల్లా వచ్చి తండ్రి గడ్డము పీఁకి జపమాల లాగి "ఒకటి నాలుగు ఏడు మూఁడు పసకొండు" - అని పూసల లెక్కిడుచుండెడివాఁడు.

హిదాయుతుల్లాకు ఒకచేతిలో కొడుకు, రెండవచేతిలో ఖురాను. ఒక కంట రాచకార్యము, రెండవ కంట పుత్రదర్శనము.

హిదాయతుల్లా అయిదుమాఱులు నమాఁజు చేయఁగా రహ్మత్ ఉల్లా పదిమాఱులు చేసెను. తండ్రి ఖురాను ఏకరువుపెట్టఁగా కుమారుడు గూడ కూడకూడ నేకరువు పెట్టెను. పెద్దఉల్లా పాదప్రక్షాళన మొనరింపగా చిన్నఉల్లా పాదప్రక్షాళన మొనరించెను. తండ్రి రాచకార్యములను చూచి కుమారుఁడు కూడ భృత్యుల యెదుట రాచకార్యములను నడుపుట ననుకరించెను. చిన్నఉల్లా బాల్యమిటు లల్లారుముద్దుగా నడచెను.

ఒకనాఁడు రహ్మత్ ఉల్లా పడమటి దెస కభిముఖుఁడయి ఉత్తరమునుండి దక్షిణమునకు అక్కరములు వ్రాయనేర్చెను. సూర్యాభిముఖుఁడయి కూరుచుండి దక్షిణమున నారంభించి ఉత్తరమునకు వ్రాయనేర్చెను. నేలపల్లి వలకలకును కొండపల్లి కాకితములకును ఖర్చు హెచ్చెను.

ఖురానంతయు వ్రాయుటకొక ముల్లాను, భారతమంతయు వ్రాయుట కొక పండితుని హిదాయతుల్లా నియమించెను.

అతఁడొకనాఁడు తనపేరు వ్రాసి తండ్రికడ రవ్వలయుంగరమును కానుకఁ బడసెను. గుఱ్ఱమెక్కి తల్లికడ నొక తంగణాను సంపాదించెను. తుపాకి ప్రేల్చి పెత్తల్లికడ ఖడ్గముఁ బడసెను.

అతఁడిటులు ఒక పర్యాయము పంతులు, కాజీ, పండితుడు, సేనా నాయకుడుగా అయిపోయెను.

రాజబాలకుఁడు జన్మముతోడనే పండితుడు, శూరుడు, కాజీ; కాని రాజత్వము తొలఁగించినను రహ్మత్ ఉల్లా పండితుఁడు; శూరుడు, కాజీ అని ముల్లా యనెను. ఉపాధ్యాయుఁడును అనెను. బాలురందరును అతని శూరతకు సాక్షులు. పెద్ద ముల్లా సాక్షి.

అతనికి నేలంటు వదలెను. పెద్దపెద్ద వ్రాత పుస్తకములు చేతి కెక్కెను. పుస్తకములు చదివిన కొలఁది క్రింది మెట్టునుండి మీద మెట్టెక్కి నటు లుండెను. అతఁడిపుడు తేనెటీఁగ. ఆ తేనెటీఁగ వెనువెంటనే పెద్ద తేనెటీఁగ హిదాయతుల్లా.

హిదాయతుల్లా మఱియొకతూరి బాల్యమనుభవించెను. కుమారునితో నవ్వెను. అతనితో పాంసు క్రీడ చేసెను. అతనితో విందారగించెను. అతనితో అక్షరములు దిద్ది పుస్తకము పట్టెను. అతనితో నాలోచించెను. అతనితో సాముచేసెను. తాను గుఱ్ఱమెక్కి యతని నెక్కించెను. తాను వ్యయము మాని కుమారుని కేటేట లక్షరూపాయలు ఇచ్చుచుండెను.

పంక్తిని కుమారుఁడు లేక అతఁడు ఆరగింపలేదు. కుమారుఁడు ప్రక్క నిదిరింపక తాను నిదిరింపలేదు. కుమారుఁడు నవాఁజు చేయక తాను జేయలేదు.

## 2

రహ్మత్ ఉల్లాకు తన బోడిగుండు బాగుండలేదు. అతఁడు జులపాలు పెంచి పంచికట్టి ముచ్చిలిగుంట మీఁద తరంగములవలె వ్రాలునటులు కత్తిరింపించుకొనెను. తండ్రి కిష్టమును తన కష్టమునగు గడ్డమును గొఱిగించుకొనెను. అతని మీసములు నిక్కఁబొడుచుకొని "ఇట్టి విషయములలో నీవేమియు చెప్పరా"దని తండ్రికి వ్రేలెత్తి చూపుచున్నటులుండెను. చాపుఁ జక్కదనములతోఁ జేతులును,పొందికపాదవులతో మూఁపులును, తీరు తీయములతో కన్నులును, వజ్రవదనముతో జవుక్కుమను నడుమును, నడుమఁ బల్లముగను బ్రక్కల నాదోక మెరకగ వీపును, వెడఁదయు నిడుదయునగు నెదదయు నమరి యతఁడు మగవారినే మఱపించునటులుండెను.

అతఁడు చదువుకొనుచుఁ జదువుకొనుచు అడపముఁదాల్చి ప్రక్కగా లోనికిఁ బోవు తాంబూలవల్లిని తలయెత్తి చూచెను. అతని వదన మెల్లఁబాఱెను.

కొంతసేపటిలోనే లోనుండి తాంబూలవల్లి వెలువడెను. రహ్మత్ ఉల్లా తలయెత్తెను. ఇంతలో హిదాయతుల్లా కొడుకుఁగుఱ్ఱను జూడవచ్చెను. చిన్నఉల్లా తల చివాలున ఖురానులోనికి వంగెను.

కుమారుని రాచపనులలో దిద్దితీర్చుటకు అపుడచటికిఁ దండ్రి వచ్చెను. కుమారుఁడు వలరాచపనులలో ఓనమాలు దిద్ద మొదలిడెనని అమాయకుఁడు ఆ తండ్రి యెఱుగఁడు.

"నాయనా! జమాబందీ చేయింతువు గాని వత్తువా?"

"నేడు కాదు, తేపు."

తండ్రి వెళ్ళిపోయెను.

పన్నీరుబుడ్డి యెత్తుకొని జులేఖా అతని గది గూటి ముందఱి నుండి నడచుచుండెను. రహ్మత్ ఉల్లా తలయెత్తెను. జులేఖా చూచెను. అతని హృదయగుహలోని చీకటి కోణములన్నియు తళుక్కుమనెను.

దేనికిని అంటి - ముట్టని అతని బాల్య మొకపరి గిర్రునఁ దిరిగి పోయెను. వింతలకును వంతలకును బునాదియు చలపాదియునగు జవ్వనము రాజయి అతనిలో కూర్చుచుండెను.

అతఁడు బాల్యమిత్రములతో మాటాడుట మానివయిచెను. మగవారితో మాటలాడు టతనికి మోటయెను. మగవారి మూతులు గోతులు; మగపురుగనిన నతనికి రోఁత పుట్టెను. అవేమో మగవారి కాళ్ళు రోఁకళ్ళు! వారి వక్షములు అక్షములు! వారి మోములు పాములు! వారి మేను ప్రూను! తుదకు తండ్రి దాపుగా వచ్చినను అతఁడు తూపోడిచెను. అతనికి మగవాఁడు ముదార్.

కుమారుని స్వాతంత్ర్యము తండ్రికి గోచరించెను. తన తండ్రి తనకీ యేటనే సకల స్వాతంత్ర్యము లిచ్చివేసెను. తానును పిత్రాచార మవలంబించెను.

అన్నవేళ నిపుడు కొడుకున కాహ్వానము లేదు. తన శయ్య తన గది యంద, తనయుని శయ్యతనయుని గది యంద.

క్రమముగా సదియు మాఱెను. తండ్రిమేడ; కొడుకుమేడ. తండ్రికి ప్రాతమేడ; కొడుకునకు క్రొత్తమేడ.

మును పాకఁడే పాచకుఁడు. ఇపు డిరువురు. మునుపొకఁడే చాకలి. ఇపుడిరువురు. క్రమముగా నెవరి దాసిదానము వారికి, ఎవరి పారా వారికి, ఎవరి పనులు వారికి, ఎవరి యధికారము వారికి, తుద కెవరికి వారు!!

క్రొత్త మేడలోనికి వచ్చి ఇద్దఱు తల్లులును ముద్దుల బిడ్డని దీవించిరి. కుమారుఁడు సలాములుచేసెను. కొంచెముసేపుండి వారరిగిరి.

కుమారుఁడు దాపునలేమి తల్లిదండ్రులకు నిదురపట్టలేదు. హిదాయతుల్లా లేచి అటిటు పచారు చేసెను. హసీనా లేచి "మగవానిని కనరా" దని అనుకొనెను. "దానఁ జేసియే నేను మానుకొంటి"నని సాకినా యనెను.

"నీవేగి కుర్రనికడ శయనింపుము" అని హిదాయతుల్లా హసీనాతో ననెను. "అనినదే చాలునుగా" హసీనా పరగెత్తెను. హిదాయతుల్లా మేడ మీది నుండి చూచుచుఁ జూచుచు "సాకినా! ఇన్నాళ్ళకిటులు నీకేకాంతము కలుగఁజేయఁగలిగితి" అని బొంకెను.

"ఏడవపదిలోఁ గూడ నేకాంతమా? అగునులెండు. ఆడుదిముప్పదేండ్లకు ముసలి. మగవాఁడెనుబదేండ్లకును ఎలఁప్రాయము వాఁడే అయినను మన కీ యేకాంతము దక్కదు. హసీనా యెటులు పరువు లెత్తెనో యటులే పరువు లెత్తుకొని వచ్చును."

"ఏల?"

"అంతియ"

"కొంచెము వివరింపరాదా?"

"ఈ నడిరేయి వృద్ధదంపతులమగు మనవలె పిన్నవారు తీరికగాఁ గూరుచుందురా?"

"నిక్కమే! అతఁడు గాఢనిద్రలో నుండి యుండును."

ఇటులు వారిరువురును మాటలాడుకొనుచుండగనే హసీనా వడివడిగా తిరిగివచ్చెను.

"ఏమి?"

"పారా యిచ్చునది ఇరాక్‌దేశము దిట! నతూన్ మహల్‌కా ఖాస్ బాందీట! పేరు గులాప్ బేగమంట! అది నన్ను పోనీయ నన్నది."

"ఏల?"

"క్రొత్త హుజూరువారికి నిద్రాభంగము కాదా?"

"మంచిది. లేపుదు వనుకొంటిని."

"మంచిదే. కాని రేపు మీ సీలును ఉంగరమును క్రొత్త హుజూరు వారికి దాఖలు చేసికొని మీరు చేతులు కడుగుకొనుఁడు."

హసీనా మాటల కతఁడు తెల్లబోయెను. కాని వెంటనే మాఱి "ఇటు లందువేల? అట్టి పుణ్యాహమునకే నే నెదురు చూచుచున్నాను" అనెను.

## 3

హిదాయత్ ఉల్లాకు ఆంధ్రదేశమునందును మహారాష్ట్ర దేశమునందునను, జాగీరులు కలవు. కుమారుని కనుభవము కలిగించుటకు అతఁడు పల్లియలలో గుడారము లెత్తించి జమాబందీ చేయించు చుండెను. అపుడతఁడు గుడారము లెత్తించిన దొక పెద్దపల్లె. దానిపేరు మునిపల్లె. అదిపేరునకుఁ దగినది. కొండలంత కట్టులుగల యెఱ్ఱనీటి చెఱువు. దాని కానుకొని పల్లె. పల్లెచుట్టు పచ్చని కొండలు. తెల్లని వాగులు, జీబుచెట్లు, పల్లెనిండఁ జెట్లు. దొడ్లనిండ తల్లి యొఱదాఁక నీరు దాఁకు బావులు. పచ్చని పుంతలు.

హిదాయత్ ఉల్లా నవాఁజునకుఁ గూరుచుండెను. రహమత్ ఉల్లా గుఱ్ఱమెక్కి షికారు బయలుదేరెను. మరియొక గుఱ్ఱమెక్కి అతని వెనుక నొక రోహిలా.

కదము తొక్కి కొనుచుఁబోయి గుఱ్ఱమాగెను. ఎదుటఁజెఱువు కట్ట. ప్రక్కదారిన బోవుదమని రోహిలా యనెను. రహమత్ ఉల్లా గుఱ్ఱమును అడ్డముగాఁ ద్రిప్పి రోహిలామీద కొరడా విసరెను. పిదప నతఁడు గుఱ్ఱమును నిలువుగా త్రిప్పి తన గుఱ్ఱమును అదలించెను. గుఱ్ఱమొక్క నిమిషములో చెఱువుకట్ట యెక్కెను. రహమత్ ఉల్లా దానిని కొంచెము దూరము నడిపించి రోహిలా కొఱకాగెను. రోహిలా తన గుఱ్ఱమును చెఱువుకట్ట నెక్కింపలేక తన్నుకొనుచుండెను.

చెఱువుకట్ట క్రిందనే పెద్ద యగడిత. దాని కానుకొని పెద్ద గృహారామము. దాన పండ్లతో వంగిన దబ్బచెట్టు. దాని ముందొక బావి. బావి మీఁద ఆ దబ్బపండ్ల చాయలోఁ గలసిపోయి నిలువఁబడిన పదునెనిమిదేండ్ల పడుచు.

రహ్మత్‌ఉల్లా చూచి "పాతాళకన్య" యనుకొనెను.

ఆమె వంగి నీరు చేఁదుకొనుచుండెను. ఆమె కుడిచేతితో చేఁదలాగి యెడమచేతఁ ద్రాడు పట్టుకొనెను. కుడిచేతిలో మరల లాఁగి యెడమచేతితో పయ్యంట దిద్దికొనెను. పిదప నెడమ చేతితోఁ ద్రాడు పట్టుకొని కుడిచేతితో చేఁదను వెలికి లాగెను. ఆమె చెక్కిలిమీఁద చెమరు ముత్తియములనారు.

ఆమె చేఁదను దించెను. "నా కంటె నీ వేమి పచ్చగా నుంటివా? చూతము" అనునటులు ఆమె పసుపును అరచేతులతో అఱుగరాచి మోమున నలఁతిగా పులుముకొనెను. మరల చేఁదవయిచి నీరు తోడి చేతులెత్తి అలవోకగా నొదవిన స్వస్తికముతో జలకమాడెను. ఇటు లామె చేఁదవయిచి పయికిలాగి జలకమాడుచుండెను.

రహమత్ ఉల్లా ఒడలెఱుగక చూచుచుండెను. ఇంతలోనొక పెద్ద చప్పుడు! బఁర్రు, బఁర్రు!

రోహిలా యెక్కిన గుఱ్ఱము నాలుగుకాళ్ళను ఆకాశమున కెత్తి కట్టమీఁదనుండి వీపుతో క్రిందికి నడచుచుండెను. రోహిలా గుఱ్ఱపు వీఁపు వదలకుండెను.

ఆఅవధారతో నడచుచున్న యీ గుఱ్ఱపుఁజప్పుడుతో రహ్మత్ ఉల్లా నవాఁబునకు భంగము కలిగెను. వెనుతిరిగి రాకయుండుట కతనికి ఇసుమంతయు వీలులేకపోయెను. అతఁడు గుఱ్ఱమున మెలకువగా వెనుకకు త్రిప్పెను.

ఇంతలో రోహిలాలేచి తగులనున్న కొరడాదెబ్బలకు తయారగుటకుఁ బోలె పృష్ఠమును రెండు చేతులతో దులుపుకొనుచుండెను. ఎవరును నవ్వకముందే తానే నవ్వినటుల సకిలించి గుఱ్ఱము ఉదాయించెను.

ఏమియు ననక రహ్మత్‌ఉల్లా మరల గుఱ్ఱమును ద్రిప్పెను. రోహిలా గుఱ్ఱమునకుఁ బోయెను. ఉల్లాచెఱువు క్రిందఁ జూచుచుఁ జూచుచు మునుపటిచోట గుఱ్ఱము నాపెను. వనదేవత లేదు. గుఱ్ఱము కొంచెము ముందటికి నడచెను. గ్రామనాయకుఁడు ఎదురు వచ్చెను.

"ఈ యిల్లు ఎవరిది?"

"కరణముసాబ్దీ హుజూర్!"

"కరణమునకు పాకగతి యేమి?"

"కరణంగార్లు చాలా ధర్మాత్ములండీ హుజూర్! దానధర్మాలు చెయ్యడమే వారి పని. సంతులేదు. ఎవ్వరూలేదు. మూడోపెళ్ళి బాబు! పాకయితే యేం దాని ముందుకోట బలాదూర్."

రహ్మత్ ఉల్లా గుఱ్ఱమును నడిపించెను. గుఱ్ఱము విద్యుద్వేగముతో వెళ్ళిపోయెను. వెనుక పరుగిడుచున్న నాయకుఁడు వగర్చి కూలఁబడెను.

రహ్మత్‌ఉల్లా ఆ కొండలలో కట్టని కోటలను, ఆ వాగులలో త్రవ్వని తటాకములను, ఆ పచ్చని పొదలలో పన్నని గుడారములను జూచెను. చూచి చూచి చప్పరించెను. వెనుదిరిగెను. చెఱువుకట్ట మీదుగా వచ్చి శూన్యమగు ఆ గృహోద్యానమును పరికించుచు నిర్గమించెను.

కాకితముల నన్నిటిని జూచి అనుక్రమణిక యేర్పఱచి బల్లమీద నుంచి హిదాయతుల్లా ఓసరిల్లెను.

కొలదికాలమునకే రహ్మత్‌ఉల్లా వచ్చి కాకితములఁ జూచికొనెను. కాకితమున డబ్బు ఖజానాలో లేదు.

ప్రొద్దుగ్రాలెను. హిదాయత్‌ఉల్లా నవాఁజులో నుండెను. రహ్మత్ ఉల్లా కరణమును, నాయకుని, గ్రామనౌకరులను బండకొయ్యలలో వేయించెను. తాను బోయి పానుపును ఆశ్రయించెను.

## 4

తాంబూలవల్లి వచ్చి రహ్మత్‌ఉల్లా ముందు వెలవెలఁబోయెను. ఉల్లా తటాలున లేచి కూరుచుండెను.

తాంబూలవల్లి యిటులనెను – "మహారాజా! మార్తాండతేజా! కరణముగారి భార్య అల్లాబదీసుకన్న మిన్న. ఎటులందువా? విను. సంధులు విరుగవలయుచో సంధి – ప్రాణదానము చేయుచో దానము. శరీర భేదముతో భేదము. ఇటులు మనకుఁగాని తనకుఁ గాని దండోపాయమునే యామె మిగిల్చెను.

"ఏమీ!" అని రహ్మత్ ఉల్లా ఉఱిమెను. తాంబూలవల్లి యేమి చేయును? తల వాల్చెను.

రహ్మత్ ఉల్లా పకపక నవ్వి "వట్టి తమలపాకు, వట్టి తమలపాకు" అనెను. కొంచెము యోజించి, "రోహిలాను పిలుతువా?" అనెను.

"ఏర్పాటుచేసియే సెలవుకొఱకు వచ్చితిని."

"సెబాస్, మంచిది. ఏరికిని దెలియరాదు."

'అది అక్కఱమాలిన మాట."

"సరి, యేమిచేయింతువు?"

"అఱటి పండొలిచి నిన్నుఁ బిలుతును. ముసలిపులి మాత్రము కునుక వలయును."

'దాని కెపుడును కోరలు లేవు. మనకు దాని భయమే లేదు."

"మంచిది."

తాంబూలవల్లి జాఱెను. ప్రాతగూడారములో భగవత్ప్రార్థన పరిసమాప్తమాయెను.

ఇంతవఱకును కిటకిటలాడుచున్న వీధులన్నియు బంగనబయళ్ళయిపోయెను. ఏ క్షణమున ఏమి జరుగునో యెవరికి దెలియును? వెలుఁగు చీఁకటి యగును, చీకటి వెలుఁగగును. అష్టమీ చంద్రరేఖ అపుడపుడ ఆకాశ వీధిని అశూన్య మొనరించెను. చుక్కలు ఒక చక్కనిచుక్కను పరికించుటకుఁ బోలె వరుసలు తీరి కూరుచుండెను.

రహమత్ ఉల్లా కంట వత్తిడికొని కూరుచుండియుండెను. అతనికి నిమిష మేడాదిగా నుండెను. ఏమియు తోచలేదు. గులాపీ అని పిలిచెను. బదులులేదు. జులేఖా యని పిలిచెను. మాఱుమాట లేదు. కాని గుడారములో పదధ్వనియు, వెంటనే "నన్నుఁ బిలువలేదేమి?" అను వాక్యమును విని పించెను. రహమత్ ఉల్లా మొగము చేటంత అయెను. "ఇక నీదే పని."

రహమత్ఉల్లా గుడారము బయటికేగెను. జీనుకట్టినగుర్రము అచట వేచియుండెను. తాంబూలవల్లి చేతియూతతో నతఁడు గుర్రముమీది కెగిరి దూఁకెను. గుర్రము గొప్ప సకిలింతతో కోలాహలము చేయుచుఁ బరువిడెను. దానివెనుక గజ్జెల గుర్రమువలె తాంబూలవల్లి నడచెను.

"అల్లాహ్, అల్లాహ్" అనుకొనుచు హిదాయతుల్లా లేచెను. వాకిటికి వచ్చిచూచెను. కీ కారణ్యము!

"గులాపీ?"

"ం."

"జులేఖా?"

"ం."

"తాంబూల్?"

"ం."

"సులేమాన్?"

"ం."

హిదాయుతల్లా గుడారములచుట్టును దిరిగెను. వంటవారు నిద్రించుచుండిరి. బండకొయ్యలలో నున్నవారు బండకొయ్యలలోనే నిదురించుచుండిరి. సైనికుఁడొకఁడును లేఁడు. కొత్తడేరాలో కొడుకులేఁడు. అతఁడంతయు కలయఁజూచి అపాయమును శంకించెను. పటాకత్తి దూసి గుర్రుమెక్కెను. గుర్రము సకిలించెను. ఈ సకిలింత విని రహమత్ ఉల్లా గుర్రము దూరముగా సకిలించెను. నిమిషముల మీఁద హిదాయతుల్లా గుర్రము రహ్మత్ ఉల్లాగుర్రమును చేరఁబాఱెను. కరణముగారి యింటిని జుట్టువయిచిన రోహిలాలు చెట్టుకొకఁడును పుట్టకొకఁడు నయిరి. హిదాయతుల్లా గుర్రము దుమికి లోనికిఁ బరుగెత్తెను.

నడుమునుండి దూసిన ఒడ్డాణపు బాకుతో ఆ పడుచు. దాని తాఁకును తప్పుకొను తాంబులీ గులాపీ జులేఖాలు! దానిని లాగుకొనుటకుఁ బొంచి యున్న కొడుకు! ఈ రంగమంతయు నతని కంటఁ బడెను.

అతనిని జూచుచునే దాసికలు దాఁటిరి. కొడుకు కత్తితో తండ్రి మీదికి లంఘించెను. బోసిపులి చిఱుతపులిని గ్రిందఁ బడద్రోసెను. పిదప మోకాలు మండెవెట్టి తండ్రి కొడుకు గుండెలమీదఁ గూరుచుండెను. కూరుచుండి "అమ్మా! ఇక రమ్ము. ఖూనీ సెలవు పోగొట్టుకొంటిని. వీనికి నీకత్తి తోడనే నీవు శిక్ష విధింపుము." అనెను.

ఆయమ వచ్చి తండ్రికొడుకుల కత్తులు లాగుకొని" ఇతనిని నేను క్షమించితిని" అనెను.

"అమ్మా! నీవు దయావతిని. ఈ ముసలి కఠినుఁడు?" అని కొడకు గుండెలలో నొకపోటు పొడిచి, మీదినుండి లేచి అతనిని లేవదీసెను. లేవఁదీసి బయటికొక గెంటుగెంటెను. గెంటి యొడలు పట్టునన్ని దెబ్బలు కొట్టెను. కొట్టి – "నా కిక కొడుకులేడు. పొమ్ము" అని అనెను.

"వదిలినదే చాలును" గా రహ్మత్ ఉల్లా పాఱిపోయెను. హిదాయ తుల్లా కానఁ బడునంత వరకును కుమారుని జూచి చేతులెత్తి "ఓఫకీర్, ఓ ఫకీర్! ఓరి నాయనా! ఓరి నాయనా! నీ కొఱకెంత తపస్సు ధారపోసితినో అల్లాకే ఎఱుక. తుదకా అల్లా యిచ్చిన వరమా ఇది! ఓ ఫకీర్, ఓ ఫకీర్!" అనుచు తన గుడారములో పోయి పడెను.

● భారతి ●